మెరుగైన విద్యను బోధించాలి

బోథ్, సెప్టెంబర్ 23 : విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని ఎంపీడీవో జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం బాబెర తండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రతి రోజూ బడికి వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులకు కొత్త రుణాలు అందించాలి

బోథ్, సెప్టెంబర్ 23 : అర్హులైన రైతులకు రుణమాఫీతో పాటు కొత్త రుణాలు అందించాలని పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ అన్నారు. సోమవారం బోథ్ ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రైతుల రుణమాఫీ, రైతులకు కొత్త రుణాలు అందించాలని తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాజేశ్వర్, డైరెక్టర్లు శ్రీనివాస్, మనోహర్, రుక్మబాయి, దిగంబర్, రాజు, ఉమేశ్, పోశెట్టి, సీవో స్వామి పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ విద్యార్థుల శిక్షణ

సోన్, సెప్టెంబర్ 23: లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పది రోజుల పాటు ఆదిలాబాద్‌లోని శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. ఈ శిక్షణలో వెపాన్, ఫైరింగ్, ఫీల్డ్‌క్రాక్ అండ్ బాటిల్‌క్రాక్, మ్యాప్ రీడింగ్, డ్రిల్, ట్రెకింగ్, జడ్జింగ్ డిస్టెన్స్ అంశాలపై శిక్షణను ఇవ్వడం జరిగిందని ఎన్‌సీసీ అడిషనల్ ఆఫీసర్ రజిత తెలిపారు.

మాదపూర్‌లో ఆడిట్ సర్వే

ఇచ్చోడ, సెప్టెంబర్ 23 : మాదపూర్ గ్రామంలో బీఆర్పీ రవి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఉపాధి హామీ పథకం 14వ వార్షిక ఆడిట్‌ను నిర్వహించారు. కూలీలు చేసిన కొలతలు సేకరించారు. మంగళవారం ఉపాధి గ్రామ సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలో జరిగిన పని వివరాలు, నిధుల వివరాలు చెబుతామని తెలిపారు. ఆయన వెంట టీఏ సుజాత, ఎఫ్ఏ నందు, సిబ్బంది విజయ్, గణేశ్ ఉన్నారు.

మిషన్ భగీరథ పైపులపై శిక్షణ

ఇచ్చోడ, సెప్టెంబర్ 23 : ఇచ్చోడలోని మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ ఏఈ జైపాల్ ఆధ్వర్యంలో గ్రామ మంచి నీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణలో భాగంగా భగీరథ పైపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులు పాడైతే ఎలాంటి మరమ్మతులు చేయాలో వివరించారు. గ్రామ పంచాయతీలో ఉండే మల్టీ పర్పస్ వర్కర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, శిక్షకులు పాల్గొన్నారు.

తానూర్, సెప్టెంబర్ 23 : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని చేతి పంపుల నిర్వహణ, సింగిల్ ఫేస్, త్రీఫేస్ మోటర్ల రిపేర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లింగమూర్తి, డీఈఈలు లక్ష్మీనారాయణ, ఆదిత్య, ఎంపీవో నసరుద్దీన్, ఏపీవో గంగాధర్, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీఎస్ పీఆర్టీయూ కార్యవర్గం

నార్నూర్, సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో టీఎస్ పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు టాక్రే భాన్‌చందర్, ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్ అధ్యక్షతన నార్నూర్ మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గోవింద్‌రావు, సంతోష్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండలాధ్యక్షుడిగా జాదవ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ దిగంబర్, అసోసియేషన్ అధ్యక్షుడిగా చౌహాన్ హరిచంద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా శకుంతలబాయి, కార్యదర్శిగా జగన్నాథ్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశ్విన్, ఎంఈవో రాపెల్లి ఆశన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయ ప్రకారం పండుగలు ఘనంగా నిర్వహిస్తాం

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : హైందవ ధర్మం. సంప్రదాయ ప్రకారం పండుగలను ఘనంగా నిర్వహించేలా కృషి చేస్తున్నామని సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మూడో సారి కూడా ప్రమోద్ ఖత్రిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సోమవారం గోపాలకృష్ణ మఠంలో నూతన కార్యవర్గాన్ని సత్కరించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బండారి వామన్, కోశాధికారి పడకండి సూర్యకాంత్, పూసం ఆనంద్ రావు, సంజీవ్, సంతోష్, నర్సింగ్, దశరథ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం కోసమే ఇందిరా ఫెలోషిప్

ఎదులాపురం, సెప్టెంబర్ 23: మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా యూనిట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క తెలిపారు. ఇందిరా ఫెలోషిప్ ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశంగా సోమవారం మావలలో ఫెలోషిప్ మెంబర్స్‌బూట్ క్యాంపు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫెల్లోషిప్ తెలంగాణ కోఆర్డినేటర్ శివలాల్ నేతికల్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గిమ్మ సంతోష్, పట్టణాధ్యక్షుడు గుడిపల్లి నగేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, సీనియర్ నాయకులు నవీన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, జాదవ్ సునీల్ పాల్గొన్నారు.

ప్రైవేట్ దవాఖానలు తనిఖీ

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : ఆదిలాబాద్‌లోని పలు ప్రైవేట్ దవాఖానలను బాసర జోన్ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌బాబు సోమవారం తనిఖీ చేశారు. ప్రైవేట్ దవాఖానలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ మేరకు నిర్వహిస్తున్నారా లేదా అనేది పరిశీలించారు. అనంతరం ఆయన పలు రిజిస్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట రాష్ట్ర బృందం సభ్యులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, డీఎంహెచ్‌వో కృష్ణ, వైద్యాధికారులు రాథోడ్ నరేందర్, గజానంద్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవాలి

వాగులో కరగని గణేశ్ విగ్రహాలను తీస్తున్న సభ్యులు

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : పర్యావరణ పరిరక్షణతో పాటు నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ అన్నారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టీ) వాగు వద్ద శుభ్రత కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది సోమవారం చేపట్టారు. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా కరగని విగ్రహాలను, చెత్తాచెదారం తొలగించి వాగు ఘాట్‌ను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ అవి కిరణ్, టీఎంసీ భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ పోశెట్టి, శానిటరీ జవన్ ప్రేమ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- ఎమ్మెల్యేను కలిసిన పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు

నేరడిగొండ, సెప్టెంబర్ 23 : ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం నేరడిగొండలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైన ఆధారపడి ఉంటుందన్నారు. విద్యతోనే సమాజంలో సమూలమైన మార్పు వస్తుందని అన్నారు. అందుకే విద్యార్థులను విద్యారంగంలో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్‌కు బాటలు వేయాలని కోరారు. ముందుగా ఎమ్మెల్యేను కార్యవర్గ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. జిల్లా కారవర్గం ఆధ్వర్యంలో బోథ్, బజార్ హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్ పీఆర్టీయూ మండల కార్యవర్గ సభ్యులను నేరడిగొండలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్, సెప్టెంబర్ 23: పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తొడసం భూమన్న ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

తలమడుగు, సెప్టెంబర్ 23 : తలమడగు మండలం భోడద్ గ్రామానికి మంగళవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ రానున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అధ్వానంగా రోడ్డు

- గోదాం, పంట పొలాలకు వెళ్లలేని దుస్థితి

తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న రోడ్డు

కుంటాల, సెప్టెంబర్ 23 : కుంటాల మండలం అందకూర్ గ్రామంలో చెరువు అనుకొని ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డు నర్సాపూర్ మండలం బామ్ని వరకు గుంతలమయంగా, అధ్వానంగా మారింది. వర్షాలకు చెరువు నిండి ఆ దారి వరకు నీటితో అలుగుపారుతుంది. చెరువు అలుగు కూడా శిథిలావస్థకు చేరుకుంది. రైతులు ధాన్యం బస్తాలు నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం ఈ దారి గుండా నిర్మించిన గోదాము నిరూపయోగంగా ఉంది. గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూములు కూడా అటువైపు ఉన్నాయి. చెరువులో మత్స్యకారులు చేపలు పడుతూ జీవనోపాధి పొందుతుంటారు. ప్రతిరోజూ ఈ దారి గుండానే రైతులు, మత్స్యకారులు, గోదాములో పని చేసే కూలీలు వెళ్లాల్సి ఉంటుంది. వ్యవసాయ పనులు వినియోగించే ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. తాత్కాలికంగా పక్కకు రోడ్డు ఏర్పాటు చేసుకున్న గుంతలు గుంతలుగా ఉండడంతో ఇటీవల బైక్ నుంచి అదుపుతప్పి పడిపోయి గాయపడిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈఈ క్రాంతి కుమార్ వివరణ కోరగా మరమ్మతు కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

సమస్యను పరిష్కరించాలి

నాకు అవతలివైపు 16 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్నది. ప్రతి రోజూ ఏదో ఒక పని మీద అటు వెళ్లాల్సి ఉంటుంది. చెరువు దగ్గర దారి ఆటంకం ఉండడంతో బండ్లు పోక ప్రతి వర్షాకాలం ఇబ్బంది అవుతుంది. గోదాం నుంచి ధాన్యం నిల్వ చేసుకోవడానికి కూడా కుదరట్లేదు. ప్రభుత్వం తొందరగా సమస్యను పరిష్కరించాలి.

-ముద్దం దేవరాజు, రైతు, అందకూర్

పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాత్‌రూమ్‌లో పడేసిన మద్యం సీసాలు, పగలగొట్టిన సీసా వక్కలు

జైనథ్, సెప్టెంబర్ 23 : జైనథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆదివారం రాత్రి ఆకతాయిలు బాలికల మూత్రశాలలో మద్యం తాగి సీసాలను పగలగొట్టి చిందరవందరగా చేశారు. పాఠశాలకు ఎవరు క్యావెంజర్స్ లేకపోవడంతో అర్ధరాత్రి గర్తు తెలియని ఆకతాయిలు వచ్చి మద్యం తాగి ఆ బాటిళ్ల పగలగొట్టి విద్యార్థులకు నడవకుండా చేస్తున్నారు. దీంతో మూత్రశాలకు వెళ్లాలంటే బాలికలు భయాభ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాలకు కూత వేటు దూరంలో పోలీస్ స్టేషన్ ఉన్న ఆకతాయిలకు ఎలాంటి భయం లేకపోగా రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ శూన్యంగా మారింది. ఇప్పటికైన పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలపాలను అరికట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు.

ఆర్థిక సాయం

ఎదులాపురం, సెప్టెంబర్ 23 : ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఏఎస్ఐ యూనుస్ ఖాన్ సీఏడీ హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తూ జూలై 7వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. యూనుస్ ఖాన్ కుటుంబ సభ్యులకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 1989 పోలీసు బ్యాచ్‌కు సంబంధించి పోలీసు మిత్రులు కలిసి రూ.50 వేల చెక్కును ఎస్పీ గౌష్ ఆలం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎలాంటి సహాయ సహకారమైనా ప్రయోజనాలు వెంటనే అందేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిని ఆదేశించారు. కార్యక్రమంలో కోర్టు లైజన్ అధికారులు సయ్యద్ తాజుద్దీన్, ఈశ్వర్ సింగ్, రాఘవేంద్ర, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ సుభాష్, హెడ్ కానిస్టేబుల్ అత్త ఉల్లా ఖాన్, జహీరొద్దీన్, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఏకరూప దుస్తులు అందించాలి

దిలావర్‌పూర్ సెప్టెంబర్ 23 : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఏకరూప దుస్తుల జతలను సకాలంలో అందించాలని నిర్మల్ డీఎల్పీవో రమేశ్ అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల ఏకరూప దస్తుల పని జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. స్టిచ్చింగ్ గురించి మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో నిర్మల్ డివిజన్‌లోని ఆయా గ్రామాల మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయి సహాయకులతో సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ తాగునీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, ఈజీఎస్ ఏపీవో దివ్యరెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గిరిజన క్రీడాకారులు

ఉట్నూర్, సెప్టెంబర్ 23: ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో గిరిజన క్రీడాకారులు సత్తా చాటారు. సోమవారం వారిని శాలువాలతో జిల్లా క్రీడాధికారి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల విభాగంలో కార్తిక్ బంగారు పతకం, నగేశ్ కంచు పతకం, 14 ఏళ్ల బాలుర కిడ్స్ జావెలెన్ త్రోలో జాకేశ్ కంచు పతకం, 60 మీటర్ల పరుగులో విక్రం కంచు పతకం, 16 ఏళ్ల విభాగంలో జావెలిన్ త్రోలో సతీశ్ కంచు పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో కోచ్ సునంద్, ఏసీఎంవో జగన్, పీడీ హేమంత్, కోచ్ శేఖర్ పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థికి ప్రథమ బహుమతి

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 23: సాలేవాడ(కే) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సంఘచరణ్ హిందీ దివస్ సందర్భంగా ఈ నెల 22న జిల్లా స్థాయిలో హిందీ భాషా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలో ప్రథమ బహుమతి సాధించారని ప్రధానోపాధ్యాయుడు సింగిడి రమేశ్ రెడ్డి తెలిపారు. విద్యార్థికి ప్రశంసాపత్రం, బహుమతి అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

ముగిసిన రుషి పంచమి ఉత్సవాలు

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 23: ఇంద్రవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అందునాయక్‌తండాలో జ్వాలాముఖిదేవి, కాళుబాబా, పాచుబాబా ఆలయ ఆవరణలో ఆలయ మహారాజ్ రాంసింగ్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైన రుషి పంచమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మథురా సమాజ్ భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ నగేశ్ రుషి పంచమి ఉత్సవాల్లో పాల్గొని జ్వాలాముఖిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మహారాజ్ రాంసింగ్‌బాబా ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మహారాజ్ రాంసింగ్‌బాబా, మాజీ జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, బీజేపీ రాష్ట్ర నాయకులు రితేశ్ రాథోడ్, పార్టీ మండలాధ్యక్షుడు రాజలింగు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

తాంసి, సెప్టెంబర్ 23 : పొన్నారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు అన్నారు. సోమవారం విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాలలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరుతూ ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజర్షి షాకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 73 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయులు బోధిస్తున్నారని అన్నారు. వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయకపోతే పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తామని తల్లిదండ్రులు వెల్లడించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, రమణ, అశోక్, విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

బాసర, సెప్టెంబర్ 23 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి (65) మృతదేహం లభ్యమైనట్లు సోమవారం ఎస్ఐ గణేశ్ తెలిపారు. పసుపు పచ్చని చీర, ఎర్రని జాకెట్ ధరించి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించకపోగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖైంసా ఏరియా దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పరామర్శ

లోకేశ్వరం, సెప్టెంబర్, 23: లోకేశ్వరం మండలం ఎడ్డూర్ పాటపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్ పటేల్ మాతృమూర్తి, సిరిమన్ శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ భోజన్న, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు దిగంబర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, యువ నాయకులు అనిల్, అశోక్, దివాకర్, అర్ష ముత్యం, నాయకులు ఉన్నారు.

జైనూర్ బాధితురాలిని కలిసిన మంత్రి, ఎమ్మెల్యే

ఉట్నూర్, సెప్టెంబర్ 23: జైనూర్‌లో అఘాయిత్యానికి గురైన ఆదివాసీ మహిళను సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని దవాఖానలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. త్వరలోనే ప్లాస్టిక్ సర్జరి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

పోలీసుల ముమ్మరంగా దర్యాప్తు

ఎదులాపురం, సెప్టెంబర్ 23 :ఆదిలాబాద్‌లోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ గిరిజన బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థి రాథోడ్ జితేందర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగించి హత్యాయత్నం చేశారంటూ ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రధానంగా సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు పలు ఆసక్తికర విషయాలను తెలుసుకున్నట్లు తెలిసింది. పట్టణంలోని ఓ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేసిన ఆధారాలను సేకరించారు. మృతుడు శుక్రవారం సాయంత్రం ఒంటరిగానే కాలినడకనే బయటకు వెళ్లి మళ్లీ ఒక సంచితో వసతి గృహానికి చేరుకున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిసింది. ఆ విద్యార్థి మరణానికి కారణాలను తెలుసుకునే దిశలో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి ఆందోళన చేసి ఉద్రిక్తత పరిస్థితులకు కారణమైన వారిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు సమాచారం. ఈ ఘటన విషయమై మావల ఎస్ఐ విష్ణువర్ధన్ వివరణ కోరగా దర్యాప్తు కొనసాగుతున్నదని, త్వరలో కేసును ఛేదించి వివరాలు వెల్లడిస్తామన్నారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

సోన్, సెప్టెంబర్ 23 : నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన సాద అభిలాష్ (17) సోమవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..అభిలాష్ నిజామాబాద్ జిల్లాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల పెద్దనాన్న కుమారుడు మృతి చెందడంతో ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. అయితే కుటుంబసభ్యులు కళాశాలకు వెళ్లమని అడగడంతో సోమవారం వెళ్తానని చెప్పాడు. సోమవారం ఉదయం ద్విచక్రవాహనం తీసుకొని గ్రామ సమీపంలోని గల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'డబుల్' లబ్ధిదారుల నిరసన

నిరసన చేపడుతున్న లబ్ధిదారులు

భైంసా, సెప్టెంబర్ 23 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం డబుల్ బెడ్రూం లబ్ధిదారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 430 మందిని డబుల్ బెడ్రూంల కోసం లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారని తెలిపారు. ఇప్పటికీ డబుల్ బెడ్రూంలు ఇవ్వడం లేదని, కిరాయి ఇండ్లలో ఉంటూ జీవనం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే డబుల్ బెడ్రూంలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డి లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఈ విషయమై అధికారులకు వివరిస్తామన్నారు. ఈ ఆందోళనలో డబుల్ బెడ్రూం లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

దస్తురాబాద్, సెప్టెంబర్ 23 : మున్యాల గొండు గూడెం గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని మున్యాల గొండు గూడెం ఆదివాసీలు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్పరాజ్ నవాజ్‌కి,ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ మున్యాల గొండుగూడెం గ్రామ ఆదివాసీలు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ప్రయాణికుడు మృతి

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 23 : తన భార్యతో కలిసి దైవదర్శనం కోసం వెళ్లేందుకు వెళ్లిన వ్యక్తి రైల్వేస్టేషన్‌లో ఫిట్స్‌తో మృతి చెందిన ఘటన బాసర రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకున